క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య అత్యవసర సమావేశం

నడిగూడెం : జూన్ 2 నుంచి తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మంగళవారం మండల సర్వసభ్య అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యం.యద్రయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని తెలిపారు.

తొమ్మిది మంది విద్యార్థులకు గురుకుల సీట్లు

నడిగూడెం : మండల కేంద్రంలోని ఎస్‌వీఆర్ స్కూల్‌కు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షల్లో సీట్లు సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కాసాని ఉపేందర్ సోమవారం విలేకరులకు తెలిపారు. 14 మంది ఈ ప్రవేశ పరీక్ష రాయగా తొమ్మిది మందికి సీట్లు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు.

వెండి అభయహస్తం బహూకరణ



వెండి అభయహస్తం అందజేస్తున్న మాజీ సర్పంచ్ రాధికాఅరుణ్‌కుమార్

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురంలో ఉన్న శ్రీ ఆంభయాంజనేయస్వామి వారికి బూరుగడ్డ మాజీ సర్పంచ్ రాధికాఅరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ రూ.6 వేల విలువ గల వెండి అభయహస్తాన్ని సోమవారం బహూకరించారు. సోమవారం ఆలయంలో అభయహస్తాన్ని ఆలయ అర్చకుడికి అందజేశారు. కార్యక్రమంలో ఫణిచరణ్ దేశ్‌ముఖ్ తదితరులు ఉన్నారు.

1న చౌటపల్లి ఆలయ భూముల కౌలు వేలం

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో గల శ్రీవేణుగోపాలస్వామి దేవాలయానికి చెందిన వ్యవసాయ భూముల కౌలు బహిరంగ వేలం 2023- 2034 సంవత్సరాలనికి గాను జూన్1న స్థానిక దేవాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మద్ది హుస్సేన్ రెడ్డి, ఈఓ ఎంపీ లక్ష్మణ్‌రావు తెలిపారు. సోమవారం వారు స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. చౌటపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 593, 594, 726 ల పరిధిలోని 7 ఎకరాల భూమి కౌలు వేలములో పాల్గొనే రైతులు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

ఎమ్మెల్యే సైదిరెడ్డి పరామర్శ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పరిధిలోని మాధవరాయిని గూడెంలో పక్షవాతంతో మంచానికి పరిమితమైన పార్దబోయిన వెంకటమ్మను సోమవారం ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పరామర్శించారు. ఆమె వైద్యానికి సంబంధించి హాస్పిటల్ వారితో మాట్లాడతానని చెప్పి వైద్య ఖర్చుల నిమిత్తం కొంత ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం స్థానికంగా నిర్వహించిన లింగమంతుల పండుగలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం చేస్తున్న సర్పంచ్ అంబేద్కర్

కోదాడరూరల్ : మండల పరిధిలోని బీక్యాతండాకు చెందిన బీక్యానాయక్ వడదెబ్బతో మృతి చెందారు. సోమవారం బీక్యా నాయక్ దహన సంస్కారాల నిమిత్తం సర్పంచ్ అంబేద్కర్ రూ.5 వేల ఆర్థికసాయం చేశారు. పేదరికంలో ఉన్న మృతుని కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. పింఛన్, ఉపాధి హామీ కూలీల డబ్బులను పోస్ట్‌మాస్టర్ తమ గ్రామంలోనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

హుజూర్‌నగర్ : చింతలపాలెం హెడ్ కానిస్టేబల్ ఎ. లక్ష్మయ్యను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. అతనిపై వివిధ ఆరోపణలు రావడంతో హైదరాబాద్ రేంజ్ డీఐజీ సస్పెండ్ చేసినట్లు ఆయన చెప్పారు.

బుర్కపిట్టతండాలో బొడ్రాయి శంకుస్థాపన

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు బుర్కపిట్టతండాలో సోమవారం బొడ్రాయి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో కౌన్సిలర్లు వట్టె రేణుక, వేములకొండ పద్మ, బీఆర్‌ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, 13వవార్డు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎస్‌కె. రఫీ, నాయకులు మాలోతు పంతులు నాయక్, భూస శ్రీధర్, శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన లోపంతో అనర్థాలు

- వరి కొయ్యలకు నిప్పు పెడుతున్న రైతులు
- జీవం కోల్పోతున్న సారవంతమైన భూములు
- అగ్నికి ఆహుతి అవుతున్న హరితహారం చెట్లు



అమీనాబాద్‌లో కాలిపోయిన హరితహారం చెట్లు

అనంతగిరి : కొందరు అవగాహన లోపంతో వ్యవసాయ భూముల్లో వరి కొయ్యలకు నిప్పు పెడుతుండటంతో గాలికి మంటలు వ్యాపించి రోడ్లకు ఇరువైపుల గల పచ్చని హరితహారం చెట్లు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. అసలే ఎండలు మండిపోతుండడంతో పంట భూముల్లో నిప్పు పడితే మంటలు కార్చిచ్చులా వ్యాపించి వ్యవసాయ విద్యుత్ వైర్లు కాలిపోయి ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. రైతుల మోటార్ల పైపులు, మోటార్లు కాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అంతేకాకుండా వరి కొయ్యలను కాల్చితే భూసారం దెబ్బతింటుందని వ్యవసాయశాఖ అధికారులు పదే పదే చెబుతున్నా పలువురి వినిపించుకోకుండా నష్టపోతున్నారు. ఇటీవల అనంతగిరి, అమీనాబాద్‌ల పరిధిలో వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో మూడు సంవత్సరాల క్రితం రోడ్ల వెంట నాటిన హరితహారం మొక్కలు సుమారు 15 వరకు కాలిపోగా మరికొన్ని చెట్లు పాక్షికంగా కాలిపోయాయి. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా హరితహారం పథకాన్ని అమలు చేస్తూ రూ. కోట్ల నిధులు ఖర్చు చేస్తూ మొక్కలు నాటుతున్నా వాటిని రక్షించడంలో మాత్రం అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలం అవుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అవగాహన కల్పించాలి..

అయితే భూమిలో ఉంటే సూక్ష్మజీవుల వలన సహజ ఎరువులైన భాస్వరం, పోటాషియం ఇతర పోషకాలు పంటలకు అందుతాయి. కానీ వరి కొయ్యలకు నిప్పు పెడుతుండటంతో భూమిని సారవంతం చేసే సూక్ష్మజీవులు చనిపోవడంతో పాటు సహజ ఎరువులు, భూసారం తగ్గిపోతుంది. అంతేకాక భూమికి జీవాన్ని అందించే బ్యాక్టీరియా, ఫంగస్, సూక్ష్మజీవులు, కీటకాలు చనిపోతున్నాయి. దీంతో రైతులు పంట దిగుబడి కోసం ప్రమాదకరమైన రసాయనాలు, ఎరువులను వాడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వీడి హరితహారం చెట్లు కాలిపోవడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని, వరి కొయ్యలు తగులబెట్టడం ద్వారా జరిగే అనార్థాల గురించి రైతులకు అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు తీసుకోవాలి



రైతులు పంట సాగు చేసే ముందు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలి. వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో భూమికి నష్టమే తప్ప లాభం ఉండదు. పైగా నిప్పు పెడితే తోటలు, చెట్లు దగ్ధమయ్యే అవకాశం ఉంది. సూక్ష్మపోషకాలు వరి పైరుకు అందాలంటే కొయ్యకాళ్లను నీరు పెట్టి భూమిలోనే మురగబెట్టాలి.

– ఏడీఏ టీ.వాసు

మళ్లీ మొక్కలు నాటుతాం



గుర్తు తెలియని వ్యక్తులు పెట్టిన నిప్పుతో అమీనాబాద్ పరిధిలో సుమారు 15 హరితహారం చెట్లు కాలిపోయాయి. మొక్కలు కాలిపోతున్నట్లు వచ్చిన సమాచారంతో రెండు వాటర్ ట్యాంకర్‌లతో నీళ్లు చల్లీ మంటలు ఆర్పించాం. కాలిపోయిన మొక్కల స్థానంలో వచ్చే హరితహారంలో మళ్లీ మొక్కలు నాటుతాం.

– పరిమి విజయ, ఎంపీడీఓ

మోతె ఎస్‌ఐని సస్పెండ్ చేయాలి



మునగాల : మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు



మేళ్లచెరువులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నేరేడుచర్ల : మోతె మండలం విభళాపురం, అప్పన్నగూడెం గ్రామాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయంటూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న పేద మహిళలతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మట్టిపల్లి సైదులుపై దాడి చేసిన ఎస్‌ఐ మహేష్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీను డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామంలో జరిగిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ దాడి ఘటనపై ఉన్నత స్థాయి అధికారులు సమగ్ర విచారణ జరిపించి అందుకు బాధ్యులైన ఎస్‌ఐ మహేష్‌తో పాటు పోలీస్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌ఐని సస్పెండ్ చేయకుంటే ఆందోళన చేస్తామని అన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

మునగాల : మోతె మండలం విభళాపురంలో ప్రజాసంఘాల నాయకుడు మట్టిపల్లి సైదులుపై ఎస్‌ఐ దౌర్జన్యం చేయడం అప్రజాస్వామికమని, సదరు ఎస్‌ఐపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కొక్కిరేణిలో నిర్వహించిన సీపీఎం గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అవకతవకలను అరికట్టాలని, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని ఈనెల 26న ఆందోళన చేస్తున్న మట్టిపల్లి సైదులుపై ఎస్‌ఐ అకారణంగా చేయిచేసుకోవడమేకాక ఈడ్చిపడవేశారన్నారు. సీపీఎం మండల కార్యదర్శి గోపాల్‌రెడ్డితో పాటు మరి కొందరిపై పోలీసులు చేయి చేసుకోవడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. సీపీఎం, ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు.సమావేశంలో గ్రామ శాఖ కార్యదర్శి నందిగామ సైదులు, సీపీఎం సీనియర్ నాయకులు పోటు పుల్లయ్య, రావులపెంట బ్రహ్మం, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వట్టెపు చినసైదులు, ములకలపల్లి సైదులు, రావులపెంట వెంకన్న, నాగరాజు, లింగయ్య పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

మేళ్లచెరువు : మోతె మండలం విభళాపురం గ్రామంలో ఈ నెల 26న సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులపై పోలీసులు దాడి చేయడంపై నిరసనగా సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు మాట్లాడుతూ మట్టపల్లి సైదులుపై పోలీసుల దాడి హేయమైన చర్య అన్నారు. ఈ దాడిని అన్ని వర్గాల ప్రజలు ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు బాధ్యులైన పోలీసులపై చర్య తీసుకోవాలన్నారు. నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెనక్కు తీసుకోవాలన్నారు. ఎస్‌ఐ మహేష్ ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుండు సైదులు, వెంకటమ్మ, సైదులు, పద్మ, లింగమ్మ పాల్గొన్నారు.

వరదాపురంలో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

మఠంపల్లి : మండలంలోని వరదాపురంలో గ్రామ దేవతలైన శ్రీపెద్దమ్మ, ముత్యాలమ్మ, అంకమ్మ, ఇంద్రపెల్లి ముత్యాలమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యాజ్ఞీకులు శ్రీరామయ్యశర్మ, రాజశేఖరశర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన దీక్షాధారణ, కంకణధారణ, కులదేవతారాధనం, యాగశాల ప్రవేశం, వాస్తు పూజ, వాస్తుహోమం, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర హోమం నిర్వహించారు. కాగా ఉత్సవాలలో రెండవ రోజు మంగళవారం జలాధివాసం, 1008 బిందెలతో జలాభిషేకం, బలిహరణ తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురప్ప జాతర



స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటున్న యాదవ కులస్తులు

మోతె : మండల పరిధిలోని రావిపహాడ్ గ్రామంలో 60 ఏళ్ల క్రితం నుంచి పూజలకు నోచుకోక శిథిలావస్థకు చేరిన గురప్ప దేవాలయాన్ని రావిపహాడ్, కోటపహాడ్ యాదవ కులస్తులు పునఃనిర్మాణం చేసి సోమవారం అంగరంగ వైభవంగా జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్లతో మహిళలు బోనాలతో ప్రదర్శనగా వెళ్లి స్వామివారికి సమర్పించారు. యాదవ కులస్తులు యాటలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. యాదవ కుల పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

కోదాడ : టీపీటీఎఫ్ ఉపాధ్యాయులు శాస్త్రీయ విద్య కోసం కృషి చేయాలని టీపీటీఎఫ్ నాయకులు కోరారు. సోమవారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కామన్ స్కూల్, శాస్త్రీయ విద్యావిధానాల కోసం ఉద్యమించాలని కోరారు. హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తించాలన్నారు. ప్రభుత్వ రంగ విద్యా సంస్థలను రక్షించుకోవాలని పేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించడానికి కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించి కోర్టులలో ఉన్న కేసులను తక్షణమే పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బడుగుల సైదులు, ముత్తవరపు రామారావు, డీఎస్ స్వామి, సీహెచ్.భిక్షం, రామనర్సయ్య, కోటయ్య, హనుమంతరావు, రామారావు పాల్గొన్నారు.

5న శ్రీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వామివార్ల కల్యాణం

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెం పరిధిలో గల త్రివేణినగర్‌లో వెలసిన శ్రీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్యస్వాముల కల్యాణం జూన్ 5న ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు కల్యాణం నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలని వారు కోరారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కలకోవలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

మునగాల : మండల పరిధిలోని కలకోవలో లేబర్ కార్డు కలిగిన కార్మికులకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆ గ్రామ సర్పంచ్ కొంపెల్లి సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ క్యాంపులో వైద్యపరీక్షలు చేయించుకోని వారు వేరే గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చేయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల శాఖ కార్మిక విభాగం అధ్యక్ష, కార్యదర్శులు చిర్రా శ్రీనివాస్, కోల ఆంజనేయులు, కార్మిక సంఘం నాయకులు సురభి రమేష్ పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

నడిగూడెం : మండల పరిధిలోని వల్లాపురం గ్రామానికి చెందిన నూకపంగు ఈదయ్య, కౌసల్య దంపతుల కూమార్తె పూర్ణ తేజిత పుట్టిన రోజు సందర్భంగా సోమవారం గ్రామ సమీపాన గల శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు బాలసుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ చైర్మన్ అర్వపల్లి నాగేశ్వరరావు, ఏలేటి వెంకటేశ్వరరెడ్డి, అచ్చిరెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటరాములు, కృష్ణారెడ్డి, రామనర్సయ్య, నారాయణరెడ్డి, ప్రభాకర్‌రావు, గోపి, పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువులతో పూర్వవిద్యార్థులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం 2000-2001 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాడు తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తుచేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేసి కలిసిన గుర్తుగా జ్ఞాపికలను అందజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గురువులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పశ్య వెంకటరెడ్డికి పలువురి నివాళి



వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి, తదితరులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, లక్ష్మీగణేష్ రైస్ ఇండస్ట్రీస్ అధినేత పశ్య వెంకటరెడ్డి ఇటీవల మృతి చెందారు. సోమవారం పట్టణ పరిధిలోని తమ్మరలో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించి ఆయన సంతాప సభకు పలు పార్టీల ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారులు అనిల్‌రెడ్డి, నవీన్‌రెడ్డిలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, ఎంపీపీ చండురు వెంకటేశ్వర్లు, గుండపనేని నాగేశ్వరరావు, జయప్రకాశ్, చక్కర చిన్నపరెడ్డి, వెంపటి మధుసూదన్, వనపర్తి లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్ తదితరులు

హుజూర్‌నగర్‌రూరల్ : రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ క్యాలెండర్‌ను సోమవారం మండల పరిధిలోని వేపలసింగారంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సహకారంతో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో చివరి భూములకు నీరు అందించేందుకు నూతన లిఫ్టుల ఏర్పాటు, ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ 13వ బ్లాక్‌కి మరమ్మతులు, సీసీ లైనింగ్ ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సారెడ్డి భాస్కర్‌రెడ్డి, గోపిరెడ్డి రాజమోహన్‌రెడ్డి, సాములు హరిలీలబ్రహ్మారెడ్డి, రాంరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

వార్డుల్లో ట్రిపుల్‌ఆర్ సెంటర్ల ఏర్పాటు



పాత దుస్తులు సేకరిస్తున్న కౌన్సిలర్, కమిషనర్

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీలో ఏర్పాటు చేస్తున్న రెడ్యూస్, రీయూజ్ రీసైకిల్ (ట్రిపుల్ ఆర్)సెంటర్లను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని 16వ, 19వ వార్డులలో సోమవారం ట్రిబుల్ ఆర్ సెంటర్లను ఆయా వార్డుల కౌన్సిలర్లు కె.విజయ వెంకటేశ్వర్లు, మంజుల హరిబాబులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరి ఇంట్లోనైనా పాత వస్తువులు, బట్టలు ఉంటే వాటిని ట్రిపుల్ ఆర్ సెంటర్లలో అందజేయాలని కోరారు. ప్రజల నుంచి సేకరించిన వాటిని అవసరమైన వారికి అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎం అశోక్, పర్యావరణ ఇంజనీర్ రాజశేఖర్, మెప్మా ఆర్పీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ డ్రైడే పాటించాలి



నిల్వ నీటిని తొలగిస్తున్న ఆశ కార్యకర్తలు

హుజూర్‌నగర్‌రూరల్ : సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా ప్రతిఒక్కరూ డ్రై డే పాటించాలని సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వేపలసింగారంలో ఆశ కార్యకర్తలతో కలిసి ఆమె ఇంటింటి సర్వేలో పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు, పాత కూలర్లలో నీటిని నిల్వ ఉంచవద్దని సూచించారు. ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న పాత టైర్లు, పగిలిన కుండలలో నీరు నిల్వ లేకుండా ఉంచితే చికెన్ గున్యా, మలేరియా, డెంగీ వంటి వ్యాధులను నివారించవచ్చని అన్నారు. అనంతరం ఇళ్లలో వృథాగా ఉన్న వాటిల్లో నిల్వ ఉన్న నీటిని ఆశ కార్యకర్తలతో కలిసి తొలగించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే సమాజంలో గుర్తింపు



క్రీడాకారులతో వ్యక్తిత్వ వికాస నిపుణుడు వేణుగోపాల్ రెడ్డి, తదితరులు

హుజూర్‌నగర్ : క్రీడల్లో రాణిస్తే యువతకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ టి.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని వీవీఎం స్కూల్‌లో శాంతిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారు అన్ని రంగాల్లో ముందుటారని అన్నారు. అనంతరం హౌ టు డెవలప్ మైండ్ పవర్, హౌ టు డెవలప్ కాన్సన్‌ట్రేషన్ అనే విషయాలపై క్రీడాకారులకు అవగాహన కల్పించారు. తను రచించిన పీస్ ఆఫ్ మైండ్, సక్సెస్ ఇన్ యువర్ హ్యాండ్స్ అనే పుస్తకాన్ని క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో శాంతిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చందా సుధాకర్‌రెడ్డి, కబడ్డీ క్రీడాకారుడు ఇంద్రారెడ్డి, పీడీలు నాగమణి, పీఈటీలు బ్రహ్మారెడ్డి, ప్రదీప్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

యువత శక్తియుక్తులను సద్వినియోగం చేసుకోవాలి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : యువత శక్తియుక్తులను సద్వినియోగం చేసుకుని లక్ష్యం సాధించాలని వ్యక్తిత్వ వికాసం నిపుణుడు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం చింతలపాలెం మండలం దొండపాడులో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఫాదర్ బాల అల్లం, పుష్ప, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

హుజూర్‌నగర్‌రూరల్ : ఉపాధి హామీ పథకంలో పనిచేస్తూ విధుల్లో నుంచి తొలించబడిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు అధికారులను విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల పరిధిలోని శ్రీనివాసపురంలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. శ్రీనివాసపురంలో 2019 సంవత్సరం నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో ఉపాధి హామీ పనులు సక్రమంగా నిర్వహించచం లేదన్నారు. 2019 నుంచి 2021 వరకు అర్హతలేని ఒక వ్యక్తి ద్వారా పనులు చేయించారని, పనిచేసిన కొన్ని సంఘాలకు పనికి తగిన వేతనం రాలేదని, వెంటనే వారి వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. 2022 ఆగస్టు నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకుందని, సస్పెండ్ అయిన శ్రీనివాసపురం ఫీల్డ్ అసిస్టెంట్‌ను కూడా విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం చెప్పినా గ్రామంలో తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ఆయన వెంట ఉపాధి హామీ కూలీలు తదితరులు ఉన్నారు.

ప్రజాగర్జన పోస్టర్ ఆవిష్కరణ

దురాజ్‌పల్లి : కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడంతో పాటు రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 4న కొత్తగూడెం జిల్లా కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ దొరెపెల్లి శంకర్, మైనార్టీ నాయకుడు పాషా, బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్, హరి, తాళ్ల సైదులు, వాడపల్లి గోపి, దిండుగల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నూతన గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత



గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న కొల్లు శ్రీనివాస్

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని కాసరబాద గ్రామంలో నూతన గ్రంథాలయానికి కొల్లు రాములుగౌడ్ జ్ఞాపకార్థం కుమారుడు కొల్లు శ్రీనివాస్ పోటీ పరీక్షలకు సంబంధించిన 44 పుస్తకాలను సోమవారం విరాళంగా అందజేశారు. బుక్ ఛాలెంజ్ అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఛాలెంజ్‌ను ప్రతి ఒక్కరూ స్వీకరించి గ్రంథాలయానికి ఒక పుస్తకాన్ని అందజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సలీం, నారబోయిన లక్ష్మయ్య, రాజు, రాము, మహేష్ తదితరులు పాల్గొన్నారు.